క్లుప్తంగా

పైడితల్లి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

దెంకాడ: మండలంలోని జొన్నాడ పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారుల ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 1,15,246 రూపాయల ఆదాయం వచ్చిందని, అలాగే అన్నదాన విరాళాల ద్వారా 46,220 రూపాయలు వచ్చాయని అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

విజయనగరం క్రైమ్: షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న వారు అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ప్రజలను త్వరితగతిన ఎలా బయటకు తీసుకురావాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అలాగే పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సందర్శన



విద్యార్థులతో మమేకమైన ఎస్‌సీఈఆర్‌టీ బృందం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని ఎంపీపీ పాఠశాలను ఎస్‌సీఈఆర్‌టీ – ఐబీ బృందం బుధవారం సందర్శించింది. స్థానిక రామతీర్థం జంక్షన్ వద్దనున్న పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. అలాగే బోధనా పద్ధతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో బృంద సభ్యులు కేశిరాజు శ్రీనివాస్, ఆల్డో, మైఖేల్, ఎస్. ప్రేమ్‌కుమార్, స్థానిక అధికారులు ఏఎంఓ పి. ప్రసాదరావు, సీఎంఓ వి. ఆదినారాయణ, డైట్ లెక్చరర్ ఎన్.తిరుపతినాయుడు, ఎంఈఓలు యు. సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్‌కుమార్, స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సీహెచ్ ఆనందమూర్తి, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

దత్తిరాజేరు: టి.భూర్జవలసలో శివాలయం నిర్మాణానికి గురువారం ఉదయం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజరు కానున్నారని పేర్కొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ ఎస్.హరిహరరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ విభాగానికి సంబంధించి రికార్డులు పక్కాగా ఉండాలని, అలాగే ప్రజలు తమసమస్యలపై స్పందనలో అందజేసిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ వెంట గ్రామ సర్పంచ్ లండ నారాయణమ్మ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. అలాగే పూడివానిపాలెం గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థం నిర్వహించారు.

ముందస్తు ప్రణాళికలతో తాగునీటి సమస్యకు చెక్

- నగర ప్రజలకు వేసవిలో యథావిధిగా రోజు విడిచి రోజు నీటి సరఫరా
- ప్రస్తుత ఏడాదికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి చంపావతిలోకి నీరు మళ్లింపు
- చంపావతి నదిలోకి ప్రవేశించిన నీటికి పూజలు చేసిన కోలగట్ల, తదితరులు



చంపావతి నదిలో పూజలు చేస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

విజయనగరం: ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం ద్వారా తాగునీటి సమస్యలకు చెక్ పెట్టామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ పాలకులు ముందుచూపుతో వ్యవహరించకపోవడం వల్ల ఐదు రోజులకొకసారి నీటి సరఫరా జరిగేదన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించామని, గడిచిన నాలుగు వేసవి కాలల్లో సైతం నగర ప్రజలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటిని అందించామని తెలిపారు. నెల్లిమర్ల వద్దనున్న చంపావతి వాటర్ పంప్‌హౌస్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు చంపావతి నది సమీపానికి చేరుకుని ఆంధ్ర రిజర్వాయర్ నుంచి వచ్చిన గంగమ్మ తల్లికి పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించి హారతులు పట్టారు. ఈసారి కూడా వేసవిలో నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని గంగమ్మకు మొక్కుకున్నారు. అనంతరం నూతనంగా కొనుగోలు చేసిన 100, 40 హెచ్‌పీ మోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. నగరంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. గతంలో మాదిరిగా దశలవారీగా వివిధ నదుల నుంచి నీటిని ముందస్తుగా దిగుమతి చేసుకొని స్టోరేజ్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆంధ్ర రిజర్వాయర్ నుంచి మళ్లించిన నీరు మార్చి, ఏప్రిల్ నెలల వరకు సరిపోతుందన్నారు. మే, జూన్ నెలల ప్రజల అవసరాలు తీర్చేందుకు ఇప్పటికే తోటపల్లి నుంచి గడిగెడ్డకు మళ్లించిన నీటిని వినియోగించేలా ముందుస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ముందుస్తుగా నీటి నిల్వలు అడుగంటి పోవడంతో తగు చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా నీటి పంపింగ్‌కు రూ. 21 లక్షలు వెచ్చించి 100, 40 హెచ్‌పీ మోటార్లను సిద్ధంగా ఉంచామన్నారు. వేసవిలో మోటర్లు పాడైతే, కొత్తగా కొనుగోలు చేసిన మోటార్లను వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు మారం బాలబ్రహ్మారెడ్డి, దూబే, బొద్దాన అప్పారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



నూతనంగా కొనుగోలు చేసిన మోటార్లను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బడ్డుకొండ



విఘ్నేశ్వరస్వామి వారి సన్నిధిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

భోగాపురం: మండలంలో ఆధ్యాత్మిక శోభ మరింత సంతరించుకునే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని నందిగాంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ నిధులు పది లక్షల రూపాయలతో నిర్మించిన విఘ్నేశ్వర ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మండలంలోని పోలిపల్లి గ్రామంలో రూ.40 లక్షల దేవదాయ శాఖ నిధులతో పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని పునఃనిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ గరే మురళీమోహనరావు, పిడుగు రాంబాబు, గరే సంజీవు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగనన్నతో టైలర్ల సంక్షేమం



మాట్లాడుతున్న టైలర్ల సంఘ అధ్యక్షుడు సురేష్

పూసపాటిరేగ: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలోనే టైలర్లకు సంక్షేమం చేకూరిందని టైలర్ల సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లెంక సురేష్ అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్ హోటల్‌లో ప్రపంచ టైలర్ల దినోత్సవంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్జీలందరికీ ప్రభుత్వం ప్రోత్సాహకంగా నగదు సాయం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఒక్కో టైలర్‌కు పది వేల రూపాయల ఆర్థిక సాయం చేయడం ఇంతవరకు ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదని చెప్పారు. టైలర్ల సంఘ భవనానికి ప్రభుత్వం స్థలం అందించే దిశగా కార్యాచరణ చేయాలని పలువురు కోరారు. పూసపాటిరేగ సర్పంచ్ టి. సీతారాం మాట్లాడుతూ.. టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో టైలర్ల సంఘ నాయకులు కానూరి బలరాం, రాంబాబు, ఆలేటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

• కుళాయిల ప్రారంభం



కేఎల్‌పురంలో నూతన కుళాయి కనెక్షన్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయగనరం: కార్పొరేషన్ పరిధిలోని 46, 45, 48 డివిజన్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ప్రారంభించారు. ఆయా ప్రాంతాలకు చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కణపాక, కేఎల్ పురం, గాజులరేగ ప్రాంతాలలో కుళాయి కనెక్షన్లు ప్రారంభించి, ప్రజలకు నీటివసతి కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. నగర ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడానికి ఎంతగానో కృషి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయుడని కొనియాడారు. 48వ డివిజన్ కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ మధు మాట్లాడుతూ.. తమ ప్రాంతాలలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య ఉందన్నారు. సమస్యను కోలగట్ల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరించారని తెలిపారు. మరో ఐదేళ్లు ఆయనకు అవకాశం ఇస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్లు బొద్దూరు గోవిందమ్మ, తాళ్లపూడి సంతోషికుమారి, పట్నాన పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనుగల రాజా, బొద్దూరు లక్ష్మణరావు, తాళ్లపూడి పండు, జోనల్ ఇన్‌చార్జ్ తమ్ము, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని వివరిద్దాం..

- ఎంపీపీ అప్పలనాయుడు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమమే అజెండాగా రానున్న ఎన్నికల్లో ప్రజల్లోకి వెళదామని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేయడంలో భాగంగా మండలంలోని కోరుకొండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో రాజకీయాలకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, అందరికీ ఇళ్లు పథకం, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ పింఛను కానుక, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, జగనన్న ఆరోగ్య సురక్ష, రైతుభరోసా పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి వరకు ఆయన ఇచ్చిన హామీలు, అమలు చేసే విధానాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.శంకర్, మాజీ సర్పంచ్ లగుడు శివాజీ, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అనిలా సునందని



వసంతరావు అందించిన వీల్‌చైర్స్‌తో సూపరింటిండెంట్ అనిలాసునందని, తదితరులు

విజయనగరం ఫోర్ట్: సేవా దృక్పథాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అనిలాసునందని అన్నారు. వసంతరావు అనే వ్యక్తి తన తండ్రి జ్ఞాపకార్థం సర్వజన ఆస్పత్రికి నాలుగు వీల్‌చైర్స్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారనని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ఎస్. సురేష్‌బాబు, అప్తాలమిస్ట్ బాలాజీ ప్రాణిగ్రాహి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చేయాలి



డిపో వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

నెల్లిమర్ల: ఏపీ బెవరేజెస్ హమాలీలకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ నాయకుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ బెవరేజెస్ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి, పీస్ రేట్ల ఒప్పందం పూర్తయి మూడు నెలలు దాటిపోయినా, ఇంతవరకు కొత్త కాంట్రాక్టర్‌తో కొత్త వేతన ఒప్పందం చేయలేదన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, డిపో కార్యదర్శి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాలను ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యలమల నాగార్జునయాదవ్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో నాడు–నేడు నిధులతో చేపట్టిన పనులను పరిశీలించి, ఎంత నిధులు మంజూరయ్యాయి, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు పెడుతున్నారా లేదా, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్నంత చొరవ గతంలో ఏ ముఖ్యమంత్రి తీసుకోలేదన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా ధీటుగా తీర్చిదిద్దారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, డిజిటల్ విద్యా బోధన, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీ వంటి కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఆయన వెంట ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ డి.వి.ఎస్.మూర్తి, డీఈ వేణుగోపాల్, ఏఈ జాన్సన్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

సైన్స్ ప్రాధాన్యం పెరుగుతోంది..

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతినాయుడు
- ఘనంగా సైన్స్ డే



విజయనగరం అర్బన్: సత్కారం పొందుతున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శరత్‌చంద్రబాబు



నెల్లిమర్ల : విజేతలతో ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు



విజయనగరం అర్బన్: విద్యార్థుల ప్రదర్శించిన వైజ్ఞానిక నమూనాలు



దెంకాడ: సీవీ రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థినులు

నెల్లిమర్ల: సమాజంలో రోజురోజుకూ సైన్స్ ప్రాధాన్యం పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో సైన్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. తిరుపతినాయుడు అన్నారు. కళాశాలలో జాతీయ సైన్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే సైన్స్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, సూర్యారావు, ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి..

విజ్ఞానశాస్త్రంతోనే మానవాళి అభివృద్ధి సాధ్యపడుతుందని రామతీర్థం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్. రామలింగేశ్వరశాస్త్రి అన్నారు. మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రోబోటిక్స్, డ్రోన్స్, సెన్సార్ టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్, కాలుష్య నివారణ, వ్యవసాయ పనిముట్లు, కాంతి తరంగాలు, ధ్వని తరంగాలు, పీడనం, వ్యాపనం, దొంగలను కనిపెట్టే అలారం, ఓటింగ్ రిగ్గింగ్‌ను నివారించే పరికరం, తదితర 107 ప్రాజెక్టులను సైన్స్ ఉపాధ్యాయుడు బల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మధుకుమార్, కుమారస్వామి, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన

విజయనగరం అర్బన్: వైజ్ఞానిక విషయాన్ని విశ్లేషణాత్మక, ప్రయోగాత్మకంగా చేసి చూపించడమే విజ్ఞానం.. అటువంటి విజ్ఞానం ఆధునిక ప్రపంచానికి అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటుచేసిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వి. శ్రీనివాసరావు, జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ బాలరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, పాఠశాల డీన్లు కె. సత్యనారాయణ, సాయికిషోర్, అప్పలనాయుడు, సూర్యచంద్రలతో పాటు, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డే ..

దెంకాడ: మండలంలోని మోపాడ వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయం, పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కస్తూరిబా గాంధీ విద్యాలయంలో సీవీ రామన్ చిత్రపటాన్ని విద్యార్థినులు ముగ్గుతో వేసి రంగులద్దారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పలువురు సందర్శించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సత్య విద్యాసంస్థల్లో..

విజయనగరం అర్బన్: సత్యా విద్యా సంస్థలకు చెందిన సీతం ఇంజినీరింగ్ కళాశాల, సత్య డిగ్రీ, పీజీ కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 'ఇండిజినెస్ ఫర్ వీక్షిత్ భారత్' పై ఇంజినీరింగ్ కళాశాలలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శరత్ చంద్రబాబును సత్కరితంచారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీవీఏ నాయుడు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తోటపాలెంలోని సత్య డిగ్రీ పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రౌండ్ వాటర్, వాటర్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారి ఎస్‌వీకే దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ సాయిదేవమణి, సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.